# నన్ను ప్రేమించకు.. కాటూరి రవీంద్ర - త్రివిక్రమ్



పద్మ

ఆ కాగితం మధ్య ఆ రెండు వాక్యాలే ఉన్నాయి.

దేవేంద్ర ఎన్నిమాట్లు చదివినా ఆ వాక్యాలే కనిపించాయి.

ఆ కాగితం లోకే చూస్తూ పద్మని ఊహించుకోసాగాడు.

ఆడవాళ్ళలో అసాధారణంగా కనుపించే ఎత్తు... ఆ ఎత్తుకి తగిన అవయవ సౌష్ఠవం. ఆమె వంటి మీద ఏ చీర కట్టినా, ముచ్చటగా వుండటం.... నిరాడంబరంగా అలంకరించుకున్నా అందులో ఎంతో ఆకర్షణ. నవ్వే కళ్ళు.... కమ్మని గాత్రం... ఒక్క పరిచయం లోనే అవతలి వాళ్ళని ప్రభావితుల్ని చేయగల మాటనేర్పరితనం..

"ఎలా? ఎలా సాధ్యం?

నిన్ను ప్రేమించడం నా మనసుకిష్టం.

నువ్వు వద్దన్నా సరే- నిన్ను ప్రేమించకుండా ఉండలేను.

-దేవేంద్ర"

కాగితం మధ్యలో అందంగా రాసి గులాబీ రంగు కవరులో ఉంచి ఆమెకి పోస్టు చేశాడు.

ఆ మర్నాడు రిసెర్చి లాబొరేటరీలో ఒకరికొకరు ఎదురుపడ్డారు.

పద్మ అతన్ని చూసి తల తిప్పేసుకుంది.

దేవేంద్ర మనస్సు చివుక్కుమంది.

అలాగే మనసులో బాధని తొక్కిపట్టి తన రూమ్‌కేసి వెళ్ళిపోయాడు.

చటర్జీ ఏకాగ్రతతో ఏదో రాసుకుంటు దేవేంద్ర రాకను గమనించ లేదు. అతని పి.య్యే. బిందు ఫైల్స్ తెచ్చి అతని ముందు ఉంచింది.

దేవేంద్ర వాటిని తెరచి చూశాడు.

కళ్ళు అక్షరాల వెంట పరుగు తీస్తున్నా మనసులోకేమీ ఎక్కడం లేదు. అతని మనసులో పద్మే మెదులుతోంది.

కాలేజీ నుండి యూనివర్శిటీకి, అక్కణ్ణుంచి న్యూక్లియర్ లాబ్‌కి ఇద్దరు కలిసే వెళ్ళారు. సైంటిస్టులుగా సమాన హోదాగల ఉద్యోగంలో ఉన్నారు, కానీ, పద్మ ఈ మధ్య కాలంలో ఎందుకంత ముభావంగా ఉంటోందో తనకి అంతు పట్టటం లేదు.

గట్టిగా నిలదీసి అడుగుదామంటే అందుకసలు అవకాశమే ఇవ్వటం లేదు.

"సర్...టీ...." ఉలిక్కిపడ్డాడు.

ట్రాన్స్‌పరెంట్ కప్పులో టీ పోసి అందించింది బిందు.

సాలోచనగా కొద్ది కొద్దిగా టీ చప్పరించసాగేడు.

బిందు అతన్నే గమనిస్తోంది.

మెల్లగా ధైర్యం చేసి "సర్...."అంది.

ఏమిటన్నట్లు ఆమెకేసి చూశాడు

"మీరి మధ్య అదోలా ఉంటున్నారు మీకభ్యంతరం లేకపోతే కారణం తెలుసుకో వచ్చా?"

అతనికి నవ్వొచ్చింది.

"తెలుసుకోవచ్చు. కాని, ఇక్కడ కాదు. ."

"ఐసీ. అయితే అడగవల్సిన చోటే అడుగుతాలెండి...." చనువుగా నవ్వేస్తూ అంది

టీ కప్పు టేబుల్ మీద ఉంచి మళ్ళీ ఫైల్సు చూడసాగాడు.

పైన తిరుగుతున్న ఫానుతోబాటు కాలం కదలిపోతోంది.

అంతలో ఇంటర్‌కం మ్రోగింది.

అందుకున్నాడు

"మిస్టర్ దేవేంద్ర.... ప్లీజ్ కమ్ టు మై రూమ్"

"ఓ కే సర్..." లేచి డైరెక్టరు గది వైపు వెళ్ళాడు.

"కూర్చోండి...." డైరెక్టర్ జగన్నాథ్ ఆప్యాయంగా చూశాడు.

"చెప్పండి...." అన్నాడు దేవేంద్ర.

"ముందుగా మీకు కంగ్రాట్యులేషన్స్"

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మీ డిజైనుకి ప్రభుత్వ బహుమతి లభించింది. దాంతోబాటు మీకు లక్ష రూపాయల నగదు బహుమతి యివ్వబోతు న్నట్లు ఈ రోజే ఉత్తరం వచ్చింది... చూడండి...." అందించాడు.

దేవేంద్ర ఉత్తేజితుడైనట్లు ఆ ఉత్తరాన్ని చదివేడు.

"థాంక్యూ వెరీమచ్ సర్! ఈ రోజే మన వాళ్ళందరికీ డిన్నర్ యిస్తాను...." ఉత్సాహంగా అన్నాడు.

"మే ఐ కమిన్ సర్...." ఇద్దరూ అటు చూశారు.

పద్మ చేతిలో కాగితాలతో నిలబడి ఉంది.

"ప్లీజ్ కమిన్ పద్మా.... నీకో గ్లాడ్ న్యూస్" అన్నాడు జగన్నాథ్.

వచ్చి ఎదురుగా కూర్చొంటూ "ఏమిటి సార్ అది?" అంది.

"మన దేవేంద్రకి నేషనల్ అవార్డు వచ్చింది. అతని డిజైనుకి ఆమోదంతో పాటు లక్ష రూపాయల నగదు బహుమతి ప్రకటించింది ప్రభుత్వం.

"సంతోషం" అంది ముక్తసరిగా.

దేవేంద్ర మనసులోని గాయం మరింత పెద్దదయింది.

"నేను వస్తాను సార్" వెళ్ళటానికి లేచాడు.

"ఓ.కే. దేవేంద్ర..." జగన్నాథ్ చిరు నవ్వుతో అనుమతించాడు.

అతను నిష్క్రమించాక పద్మకేసి చూస్తూ-

"ఎస్ పద్మా..ఎనీ థింగ్?" అడిగాడు.

"నా వర్క్ పూర్తయింది సార్. ఇవిగో రిజల్టు పేపర్స్..." ఆయన ముందుకి నెట్టింది.

కొద్ది నిముషాలు వాటిని దీక్షగా చూశాడు జగన్నాథ్.

మధ్యలో కళ్ళజోడు రెండు మార్లు సవరించుకున్నాడు.

చివరి కాగితం కూడా చూసి "గుడ్! పీటిని బోర్డుకి పంపిస్తాను...." అన్నాడు.

"వస్తాను సార్.." వెళ్ళటానికి లేచింది.

"మిస్ పద్మా...." పెన్నుని రెండు చేతుల మధ్య గుండ్రంగా తిప్పుతు, మీరెం దుకనో ఈ మధ్య చాలా సీరియస్‌గా ఉం టున్నారు కారణం తెలుసుకోవచ్చా?" మృదువుగా అడిగేడు.

ఆమె ఒక్క క్షణం అప్రతిభురాల యింది.

వెంటనే తేరుకుని నవ్వేస్తు "సైంటిస్టులు సీరియస్‌గానూ, మతిమరుపుతోనూ వుండా లనే వారు మా ప్రొఫెసర్! అది ప్రాక్టీసు చేస్తున్నా..." అంది.

"ఈజిట్ సో... ఆర్- యూ ఆర్ నాట్ విల్లింగ్ టూ టెల్ ద ఫాక్ట్?"

ఆమె ఆ ప్రశ్న నుండే తప్పించుకోవ టానికి చాలా ఇబ్బందికి గురయింది.

"ఎక్స్‌క్యూజ్ మీ సర్! మీరు పర్మిషనిస్తే లాబ్ వర్క్ చూసుకుంటాను..." అంది ముళ్ళ మీద నిల్చున్న దానిలా.

"యస్.. యస్.... అయామ్ సారీ.... యు మే గో...." అన్నాడు, కాగితాలను తన ముందుకి లాక్కుని.

పద్మ బరువుగా నిట్టూర్చి బయటకు నడిచింది.

o o o

అప్పుడే చిరుజల్లు పడి వాతావరణం

పరిశుభ్రంగా, ఆహ్లాదంగా ఉంది.

'రూఫ్ గార్డెన్‌లో ఘనంగా జరుగుతున్న డిన్నర్ పార్టీలో అతిథుల కోలాహలం కారు పార్కింగ్ ప్లేస్ దాకా వినిపిస్తూంది.

పద్మ కారు దిగకుండానే రెండు నిముషాలు ఆలోచించింది.

పైన వెలుగుతున్న లైట్లకేసి, అక్కడి సందడి కేసి ఒక మాటు చూసింది.

కారు స్టార్టు చేసి, వచ్చిన దారి వెంటే పోనిచ్చింది.

ఆమె కారు నిష్క్రమిస్తున్న సమయంలో పై నుండి దేవేంద్ర చూశాడు.

అలాగే స్తబ్దంగా నిలబడిపోయిన అతని భుజం మీద చల్లని స్పర్శ తగలగానే చటుక్కున తేరుకుని అటు చూశాడు.

బిందు!

ఆ రోజు అందం రెట్టింపయేలా అలంకరించుకుని ఉంది.

దేవేంద్ర యాంత్రికంగా చిరునవ్వు నవ్వేడు.

"పద్మ అనుకుంటాను...." అంది.

"యస్...." అన్నాడు భావాల్ని తొక్కిపడుతూ.

"మీ మనసు బాగా లేదు కదు?

"నో క్వశ్చెన్స్ ప్లీజ్" నవ్వు పులుముకున్న మొహంతో అన్నాడు.

బిందు కొద్ది క్షణాలు మౌనంగా ఉంది

"నాదో చిన్న రిక్వెస్టు..." అంది.

"ప్రేమించటం తప్ప ఏదడిగినా చేస్తాను.... చెప్పు.." అన్నాడు హాస్యంగా.

"మీ కార్లో నన్ను మా యింటి దగ్గర దింపాలి..."

"గ్రాంటెడ్! పద.... గెస్ట్‌లనొదిలేస్తే బావుండదు...." అంటూ పార్టీ మధ్య లోకి నడిచాడు.

"మరి టాక్సీ డ్రైవరులాగా వీది లోంచే వెళ్ళిపోతారా?"


"వేసావ్ వాగ్బాణం? తప్పుతుందా? పద...." కారు లాక్ చేసి వెంట నడిచాడు.

ఉన్నంతలో ఇల్లు చూడముచ్చటగా వుంది.

ఇంట్లో ఎవరూ ఉన్నట్టు లేరు.

అదే అడిగాడు.

ఇంట్లో నేనూ మా అమ్మగారే ఉండేది.



అవిడ కాశీ యాత్రకి వెళ్ళింది...."

"మీ నాన్నగారు?"

"మిలిట్రీలో పని చేస్తూ యుద్ధంలో చనిపోయారు...."

"హీరోయిక్ డెత్...." గోడ మీద ఉన్న ఫోటో కేసి చూస్తు అన్నాడు.

"మ్యాగజైన్లు చూస్తుండండి కాఫీ కలుపు కొస్తాను...." అంది వంటింటి వైపు వెళ్తూ.

"ఇప్పుడేం కాఫీ బిందూ" అంటూనే 'ఇండియా టు డే' పుస్తకం అందుకున్నాడు.

పేజీ తిప్పాడో లేడో, వెంటనే వంటింట్లోంచి 'కెవ్వు'మని కేక వినిపించింది.

ఒక్క గెంతులో అక్కడికి చేరాడు.

"ఏమైంది బిందూ?" అన్నాడు భయంతో గజగజ వణుకుతున్న బిందుని సమీపించి.

ఆమె కళ్ళు పెద్దవి చేసి కిటికీకేసి చూస్తోంది. నోటి వెంట మాట రావటం లేదు.

దేవేంద్ర అటు చూశాడు.

మొహం నిండా బురద పులుముకుని, తెల్లటి పళ్ళు కనిపించేలా వెర్రిగా నవ్వుతున్న మనిషిని చూసి షాకు తిన్నాడు. నెమ్మదిగా కోలుకుని-

హూ ఆర్ యూ.... ఎవర్నువ్వు?" బిగ్గరగా అరిచాడు.

అవతలి మనిషి వెకిలిగా వెర్రిగా నవ్వేడు.

దేవేంద్ర అతనికేసే ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

'కొంప తీసి పిచ్చివాడు కాదు కద' అనే అనుమానం కలిగి "బిందూ వెంటనే పోలీసులకి ఫోను చెయ్, నేనిక్కడే ఉంటాను.... అన్నాడు.

"బాబోయ్ నాకు భయం! అవతల వాకిటి తలుపులు తెరచి ఉన్నాయ్...."

అంది ఇంకా వణుకుతూనే.

సరే నువ్విక్కడే ఉండు. నేను వెళ్ళి ఫోను చేస్తాను..."

"వద్దు నాకు భయం..." అంది ఏడుపు గొంతుతో.

"వాట్ నాన్సెన్స్.... నేను చెప్పినట్లు చెయ్యి.... భయంగా వుంటే కాస్త యివతల నిల్చో...." విసురుగా ఇవతలికి వచ్చి ఎందుకయినా మంచిదని తలుపులు మూసి, ఫోను దగ్గరికి నడిచాడు. డయల్ చేస్తుండగానే "ఏమండీ.... దొంగ పారిపోతున్నాడండీ...." అని బిందు వేసిన కేక వినిపించింది.

చప్పున ఫోను పెట్టేసి అటు వెళ్ళాడు.

కిటికీ దగ్గర మొహం కనిపించలేదు.

దొడ్డి తలుపు తీయబోయిన అతన్ని బిందు చుట్టేసింది. అతని చెయ్యి వెనక్కి లాగేస్తూ "వద్దు.... ప్లీజ్... వాడిని వెళ్ళిపోనీండి.... మీరు వెంటపడొద్దు..." అంది దీనంగా.

దేవేంద్ర అప్రతిభుడయ్యాడు.

దొడ్డి తలుపు మీద నుండ చెయ్యి వెనక్కి లాగేసిన బిందు చేతిలో అతని చెయ్యి అలాగే చిక్కుకుని ఉంది.

ఆమె పరిస్థితి గ్రహించి, మెల్లగా నడిపించుకు వచ్చి సోఫాలో కూర్చొబెట్టాడు.

"జస్ట్ ఏ మినిట్" అని వంటింట్లోకి వెళ్ళాడు.

కొద్ది నిముషాల్లో పొగలు కక్కుతున్న కాఫీతో తిరిగి వచ్చాడు.

"ఇదేమిటి మీరు?" ఆమె సిగ్గుపడిపోయింది.

"ఫర్వాలేదు. ఇప్పుడు నీకిది చాలా అవసరం... అన్నాడు చేతికందిస్తూ.

"మీకు మర్యాద చేయాల్సింది పోయి మీ చేతే మర్యాద చేయించుకుంటున్నాను.." కించపడుతూ అంది.

"మీ యింట్లో నేను ఛేస్తేనే కథ ప్రత్యేకత?"

"అయామ్ సో సారీ..."

"నెవర్ మైండ్..."

"సమయానికి మీరు రాకపోతే నేనేమై ఉండేదాన్నో...."

"ఏమీకావు.... కాస్సేపు కంగారు పడి మళ్ళీ నువ్వే సర్దుకునే దానివి...ఎవరో పిచ్చి వెధవ. పూర్వాశ్రమంలో గోడలు దూకే దొంగయి ఉంటాడు...." తేలిగ్గా అన్నాడు.

"ఇలాంటివి జరుగుతాయని వినటమే గానీ యిదే అనుభవంలోకి రావటం. అబ్బ.. తలుచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తోంది...."

"నువ్వొక పనిచెయ్...."

"ఏమిటది?" "వెంటనే నీ బంధువు లెవరన్నా ఉంటే పిలిపించుకుని తోడుగా ఉంచుకో...."

"నాట్ పాసిబుల్"

"వై?"

"మా నాన్నగారు కులాంతర వివాహం చేసుకున్నారు. అందుకని మా యింటికి బంధువు లెవరూ రారు...."

"ఈ రోజుల్లో కూడా ఇలాంటివి ఉన్నాయా?!" ఆశ్చర్యపోయాడు.

"మీరీ రాత్రికి నాకు సాయంగా ఉండ కూడదూ?

"ఉండొచ్చు. కానీ, అందుకోసం విలువయినది పోగొట్టుకోవటం ఇష్టం లేదు..."

ఆమె కర్థం కానట్టు చూసింది.

"యస్ బిందు! నేను పద్మని ప్రేమిస్తున్నాను. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. ఇప్పటికే సున్నితంగా ఉన్న మా సంబంధాలు— మనిద్దరం ఒక రాత్రి మీ ఇంట్లో ఏకాంతంగా ఉన్నామని తెలిస్తే ఏమవుతాయో నువ్వే ఊహించు..."

పద్మ ప్రసక్తి రాగానే తనడగకముందే దేవేంద్ర ఉన్న సంగతిని సూటిగా చెప్పడంతో ఆమె ఊహలు నిర్ధారణ అయినాయి. అతని మానసిక ఔన్నత్యం గుర్తించి, మనసులోనే అభినందించింది.

"పోనీ మీరొక సాయం చేస్తారా?"

"ఏమిటది?"

"నన్ను పద్మ గారింటి దగ్గర దింపుతారా? నేనెలాగూ ఒంటరిగా ఉండలేను.."

క్షణం ఆలోచించి "సరే పద...." అంటూ లేచాడు.

o o o

"లోపలికి రావచ్చా దేవేంద్రా?"

కళ్ళ మీద చేతులడ్డం పెట్టుకుని కుర్చీలో కునుకుతున్న దేవేంద్ర ఉలిక్కిపడ్డాడు.

కళ్ళు తెరచి చూస్తే- పద్మ!

"యస్...యస్ కమిన్" సంభ్రమంగా సర్దుక్కూర్చున్నాడు.

వచ్చి ఎదురు కుర్చీలో కూర్చున్నది.

కొద్ది నిముషాలు ఇద్దరి మధ్యా మాటలు లేవు.

ముందుగా పద్మే నోరు విప్పింది.

"దేవేంద్రా! నిన్ను గత కొద్దిరోజులుగా నా మౌనంతో బాధ పెట్టినందుకు క్షమించు...." ఆమె గొంతు రుద్ధమయింది.

దేవేంద్రకి కూడ మనసులోంచి బాధ ఎగదన్నింది. గొంతులో ఏదో అడ్డం పడినట్లయి మాటలు పెగిలి రాలేదు.

"నువ్వు దేశానికి ఎంతో అమూల్యమైన వ్యక్తివి దేవేంద్రా! నీ మనసు చిన్న చిన్న విషయాలకు ప్రాధాన్యమిచ్చి బలహీనం కాకూడదు. ప్రేమించుకోవటం, ఆ వ్యక్తినే పెళ్ళి చేసుకుని జీవితాంతం చెట్టాపట్టాలేసుకుని సినిమా మనుషుల్లా బ్రతకాలనుకునే భ్రమలకి మనలాంటి వాళ్ళు గురి కావటం— అది మన విజ్ఞానానికి, మన స్థాయికి తగనివి.

మనకు ప్రేమించే శక్తి వుంటే మన కర్తవ్యాన్ని ప్రేమిద్దాం. మన దేశాన్ని ప్రేమిద్దాం. కానీ, మన స్వార్థం కోసం మన పరిధుల్ని చిన్నవి చేసుకుని సాలె గూళ్ళు కట్టుకోవద్దు.

"ఈ మాటలు నీకు చెప్పాలని చాలా మాట్లు అనుకున్నాను. కానీ నీ మనఃస్థితి అందుకు అనుకూలంగా లేదని గ్రహించి, క్లుప్తంగా నా ఉద్దేశాన్ని స్లిప్ మీద రాసి పంపాను. నా మౌనంతో, నిర్లక్ష్యంతో నీ బలహీనతను పోగొట్టి నీలో పరిపూర్ణ వ్యక్తిత్వం, నిబ్బరం కలిగించాలని శత విధాలా ప్రయత్నించాను.

"కానీ నువ్వు మారలేదు. ఎప్పటికైనా మారతావనే ఆశ కూడా నిన్న బిందు నీ గురించి చెప్పిన విషయాలు విన్నాక చచ్చిపోయింది. అందుకే ఈరోజు మన మధ్యనాకై నేను నిర్మించుకున్న ఇనుపతెరని చీలుస్తూ వచ్చాను...." ఓటమి ధ్వనిస్తున్న గొంతుతో అంది.

దేవేంద్ర వేదాంతిలా నవ్వాడు.

"ఆఫ్టరాల్ మనం మనుషులం పద్మా! రోబోట్ లాటి మర మనుషులమయితే, అనుభూతులు మనల్ని వేధించేవి కావు. మనసుకి సౌరభం లాంటిదేమన్నా వుంటే అది ప్రేమ ఒక్కటే.

"నీ ప్రేమలో పడి నా కర్తవ్యాన్ని విస్మరిస్తాననే భ్రమ నీకెలా కలిగిందో తెలియదు. మహామహుల జీవితాల ఔన్నత్యం వెనుక తప్పకుండా ఒక స్త్రీమూర్తి ఉంటి తీరుతుందంటారు. నువ్వు నాకలాంటి సహచరివి కావాలి. ప్రేమికుల జీవితాలెప్పుడూ విషాదాంతమేననే మన సాహిత్య నినాదం నిన్ను భయపెట్టిందేమోనని ఇన్నాళ్ళూ అనుకున్నాను. నేను గొప్ప వాడి నన్నావ్. మరింత గొప్పవాడినవాలంటే నువ్వు నాతో జీవితం పంచుకున్నప్పుడే సాధ్యం.... జీవితంలో నేను పెళ్ళి చేసుకుంటే కేవలం నిన్నే! లేకపోతే, యీ జన్మకింతే...." విరక్తిగా అన్నాడు.

పద్మ లేచి నిలబడింది.

దేవేంద్ర అలాగే నిర్లిప్తంగా చూస్తున్నాడు.

"ఓ.కే.... వస్తాను దేవేంద్రా" అంటూ అతన్ని ఏకాంతానికి అప్పగించి వెళ్ళిపోయింది.

దేవేంద్ర అలాగే స్తబ్దంగా ఉండిపోయాడు.

పద్మ ఎందుకు వచ్చినట్లు?

ఎందుకు వెళ్ళిపోయినట్లు?

ఏమి నిర్ణయించుకున్నట్లు?

ఇవే ప్రశ్నల మధ్య అతను ఎంతసేపు గడిపాడో అతనికే తెలియదు.

ఫోను మ్రోగినప్పుడు కాస్త తేప్పరిల్లి యాంత్రికంగా అందుకుని "దేవేంద్ర...." అన్నాడు.

"నేను పద్మని! నీతో మా నాన్నగారు మాట్లాడతారట... మాట్లాడు...." -

"హల్లో...."

"చెప్పండి సార్!"

నువ్వు మా అమ్మాయిని పెళ్ళిచేసుకుంటానన్నావట కదూ?"

"అవునండీ...."

"కట్నం ఏమీ అక్కర్లేదుగా?"

మీ అమ్మాయే నాకు కట్నం...."

వట్స్ గుడ్ రేపు మా ఇంటికి రండి" ఫోను పెట్టేశాడు.

'పద్మా యూ ఆర్ టూ సెంటిమెంటల్' అనుకుంటూ నవ్వి హుషారుగా బయటకు నడిచాడు.